



























ఉత్సాహంగా నూతన సంవత్సర వేడుకలు

- ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసిన పోలీసులు
- కిటకిటలాడిన మార్కెట్లు

బుట్టాయగూడెం/జంగారెడ్డిగూడెం/ కుక్కునూరు : 2024కు వీడ్కోలు పలుకుతూ 2025 కొత్త సంవత్సరానికి అన్నివర్గాల ప్రజలు స్వాగతం పలికారు. మంగళవారం అర్ధరాత్రి దాటిన తర్వాత యువత నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలుపుతూ నినాదాలు చేశారు. మిఠాయిలు పంచుతూ ఒకరికొకరు శుభాకాంక్షలు తెలియజేసుకున్నారు. మరొక పక్క చర్చిల్లో క్రైస్తవులు ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఆలయాల్లో భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. నూతన సంవత్సరానికి స్వాగతం పలికేందుకు అన్ని ఏర్పాట్లను చేసుకున్నారు. బ్యాకరీలు, పండ్లు, పూలు, స్వీటు దుకాణాలు కిటకిటలాడుతూ కనిపించాయి. గిరిజన ప్రాంతంలోని అన్ని మండలాల్లో అన్ని పార్టీల నాయకులు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేసుకుంటూ ఫ్లెక్సీలను ఏర్పాటు చేశారు. ఇంటి ముంగిళ్లను రంగుల హరివిల్లులతో అలంకరించే పనిలో యువతులు నిమగ్నమయ్యారు. నూతన సంవత్సర వేడుకల సందర్భంగా పోలీసులు ప్రత్యేక నిఘా ఏర్పాటు చేశారు. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ప్రత్యేక చర్యలు చేపట్టారు.

●జంగారెడ్డిగూడెం పట్టణంలో నూతన సంవత్సర వేడుకల సందడి నెలకొంది. పట్టణంలోని ప్రధాన రహదారులన్నీ జన సందోహంతో నిండిపోయింది. ఏలూరు రోడ్డు, కొవ్వూరు రోడ్డు, అశ్వారావుపేట రోడ్లలోని వ్యాపార సముదాయాలు ప్రజలతో కిక్కిరిసాయి. ముఖ్యంగా బిర్యాని పాయింట్లు అడుగడుగునా ఏర్పాటు చేశారు. వ్యాపారస్తులు ఆఫర్లను ప్రకటిస్తూ వినియోగదారులను ఆకర్షిస్తున్నారు.ముఖ్యంగా రాత్రి సమయంలో శబ్ద కాలుష్యాన్ని కలిగిస్తూ వాహనాలు నడపడం, బాణసంచా కాల్చడం వంటివి చేసినా, అతిగా మద్యం సేవించి రోడ్డుపైకి వచ్చినా, గొడవలకు పాల్పడినా కఠిన చర్యలు తీసుకుంటామని పోలీసులు హెచ్చరించారు.



బుట్టాయగూడెంలో పూలబొకే, పండ్ల దుకాణం



జంగారెడ్డిగూడెం: అశ్వారావుపేట రోడ్డులో కేక్‌లు విక్రయిస్తున్న దుకాణం వద్ద రద్దీ

ఘనంగా వేడుకలు.

కొయ్యలగూడెం: కొత్త సంవత్సరం వేడుకలు మంగళవారం సాయంత్రం నుంచి మండల వ్యాప్తంగా ఘనంగా ప్రారంభమయ్యాయి. చర్చిల వద్ద, ప్రభుత్వ ప్రైవేటు విద్యాసంస్థల్లో సిద్ధం చేసిన ప్రత్యేక శిబిరాల్లో కొత్త సంవత్సరాన్ని ఆహ్వానిస్తూ వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా హైస్కూళ్లు, ప్రాథమిక పాఠశాలలోని చిన్నారులకు శాంతాక్లాజ్ వేషధారణలతో ఉన్న యువకులు బహుమతులు అందజేశారు. ఉపాధ్యాయ ప్రధానోపాధ్యాయులు, ప్రిన్సిపాల్స్ ఆధ్వర్యంలో కేక్‌లు కట్ చేసి స్వీట్స్ పంపిణీ చేశారు. ప్రస్తుత సంవత్సరానికి వీడ్కోలు పలుకుతూ నూతన సంవత్సరానికి ఆహ్వానం పలుకుతూ బెలూన్‌లను ఎగురవేశారు. రాజవరంలో నిర్వహించిన న్యూ ఇయర్ వేడుకల్లో జెడ్పీటీసీ దాసరి శ్రీలక్ష్మి ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. అశోక్‌నగర్, కొయ్యలగూడెం, కన్నాపురం బయ్యన్నగూడెంలో న్యూ ఇయర్ వేడుకలు తమ పిల్లలతో కలిసి ప్రజలు నిర్వహించారు. ప్రిన్సిపాల్ ఐ.రాజకుమార్, ఉపాధ్యాయులు గాలిబ్ మాస్టర్, స్వామి, పాస్టర్లు పాల్గొన్నారు.

నూతన సంవత్సర వేడుకలను వ్యతిరేకిస్తూ ర్యాలీ

బుట్టాయగూడెం: అమెరికన్ సామ్రాజ్యవాద విష సంస్కృతిని వ్యతిరేకించాలంటూ పీవైఎల్, పీఓడబ్ల్యూ, పీడీఎస్‌యూ, అరుణోదయ ఆధ్వర్యంలో బుట్టాయగూడెంలో మంగళవారం ఆయా సంఘాల నాయకులు స్థానిక పార్టీ కార్యాలయం నుంచి బస్టాండ్ వరకూ నెహ్రూబొమ్మ సెంటర్ మీదుగా జెడ్పీ హైస్కూల్ వరకూ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా పీడీఎస్‌యూ రాష్ట్ర అధ్యక్షులు ఈ. భూషణం, పీవైఎల్ నాయకులు కె. పోతురెడ్డి, టి.బాబూరావు, మహిళా నాయకురాలు టి. సత్యవతి మాట్లాడుతూ కొత్త సంవత్సరం వేడుకల పేరుతో యువతీ యువకులు మద్యం, డ్రగ్స్, గంజాయికి బానిసలుగా మారి విలువైన ప్రాణాలు కోల్పోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సంస్కృతిని విడనాడాలని పిలుపునిచ్చారు. కట్టం నాగేశ్వరరావు, గుజ్జు రమేష్‌బాబు పాల్గొన్నారు.

పథకాలు అమలు చేయాలి

కుక్కునూరు: గుండుగూడెంలో పీవోడబ్ల్యూ (ప్రగతిశీల మహిళా సంఘం) జిల్లా కమిటీ సమావేశం మంగళవారం జిల్లా అధ్యక్షురాలు సోడే విజయ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్ష కార్యదర్శులు సోడే విజయ, ఎస్‌కే మున్ని మాట్లాడుతూ, కూటమి ప్రభుత్వం రాష్ట్రంలోని మహిళలకు ఉచిత ఆర్టీసీ బస్సు ప్రయాణం ఎన్నికల హామీనీ వెంటనే అమలు చేయాలని కోరారు. విద్యార్థినీ, విద్యార్థుల తల్లుల ఖాతాలకు తల్లికి వందనం సొమ్ము జమ చేయాలని డిమాండ్ చేశారు. జిల్లావ్యాప్తంగా అన్ని ప్రభుత్వ, ప్రైవేట్ వైద్యశాలల్లో నెలకొన్న సమస్యలపై జనవరిలో సర్వే చేసి కలెక్టర్ కార్యాలయం ముందు ధర్నా చేయాలని పీవోడబ్ల్యూ జిల్లా కమిటీ జిల్లా కమిటీ నిర్ణయించిందన్నారు. కుక్కునూరు ప్రభుత్వ ఆసుపత్రిలో ప్రసూతి వైద్యురాలు, గైనకాలజిస్టను నియమించాలని కోరారు. టి.సీత, కె.సత్యావతి, కె.రత్తమ్మ, ఎం.కన్నమ్మ, జి.రమణ పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో తిరుప్పావై సేవ

కొయ్యలగూడెం: ధనుర్మాసం సందర్భంగా నిర్వహిస్తున్న తిరుప్పావై పఠనం పదిహేను రోజులు(పక్షం) పూర్తయ్యిందని అర్చకులు గుడిపూడి శేషాచార్యులు మంగళవారం పేర్కొన్నారు. శ్రీ రుక్మిణి సత్యభామ సమేత మదన గోపాలస్వామి ఆలయంలో ఉదయం, సాయంత్రం వేళల్లో నాదనీరాజనం, గోదాదేవి స్తుతించి, పఠించిన తిరుప్పావై సేవా కార్యక్రమాలు కొనసాగుతున్నాయన్నారు. వైష్ణవ ఆలయాల్లో తిరుప్పావై జనవరి 12 వరకు నిర్వహించి 13వ తేదీ గోదాదేవి, శ్రీరంగనాథుల కల్యాణంతో ముగుస్తుందన్నారు.

అంకితభావంతో పనిచేసే ఉద్యోగికి గుర్తింపు

ద్వారకాతిరుమల: విధి నిర్వహణలో అంకితభావంతో పనిచేసే ప్రతి ఉద్యోగికీ సమాజంలో తగిన గుర్తింపు లభిస్తుందని శ్రీవారి దేవస్థానం ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ డీవీ భాస్కర్ అన్నారు. ఆలయంలో ఈఈగా పనిచేసి మంగళవారం పదవీ విరమణ పొందిన నంద్యాల వెంకటసత్యనారాయణ రాజును శ్రీవారి కొండపైన ఒక కల్యాణ మండపంలో ఆలయ ఉద్యోగులు ఘనంగా సత్కరించారు. ముందుగా ఆలయ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ భాస్కర్, డీఈఓ బాబూరావు, ఏఈఓలు, సూపరింటిండెంట్‌లు, ఇంజనీరింగ్ విభాగ సిబ్బంది రాజు దంపతులను ఘనంగా సన్మానించారు.

అడుగడుగునా శ్రీవారికి హారతులు

ద్వారకాతిరుమల: ఉభయ దేవేరులు, గోదాదేవితో కలిసి క్షేత్ర పురవీధుల్లో ఊరేగుతున్న శ్రీవారికి భక్తులు అడుగడుగునా హారతులు పడుతున్నారు. ధనుర్మాసాన్ని పురస్కరించుకుని నిత్యం ఉదయం వేళ స్వామి, అమ్మవార్లు క్షేత్ర పురవీధుల్లో అట్టహాసంగా ఊరేగుతున్నారు. ఈ క్రమంలో మంగళవారం స్వామివారి గ్రామోత్సవం పురవీధుల్లో వైభవంగా నిర్వహించారు. తిరువీధి సేవ అనంతరం గుడి సెంటర్‌లోని ధనుర్మాస మండపంలో స్వామి, అమ్మవార్లను ఉంచి అర్చకులు ప్రత్యేక పూజలు చేశారు. ఆ తరువాత భక్తులకు తీర్థ ప్రసాదాలను అందజేశారు.

నైపుణ్యాభివృద్ధి శిక్షణకు దరఖాస్తు చేసుకోండి

జంగారెడ్డిగూడెం: మెప్మా ఆధ్వర్యంలో వివిధ రంగాల్లో అనుభవం కలిగిన వృత్తిదారులకు నైపుణ్యాభివృద్ధి శిక్షణనిస్తామని మున్సిపాల్ కమిషనర్ కె.వెంకటరమణ మంగళవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. అర్హులైన వారు ఈ శిక్షణకు దరఖాస్తు చేసుకోవాలన్నారు. మున్సిపాలిటీ పరిధిలో ప్లంబర్లు, పెయింటర్స్, కార్పెంటర్స్, ఎలక్ట్రీషియన్, ఏసీ, వాషింగ్ మెషీన్, టీవీ, గీజర్, మెకానిక్స్, బ్యూటీషియన్ (పురుషులు - స్త్రీలు) సంబంధిత రంగంలో ఉన్న సర్వీసు ప్రొవైడర్స్‌ను గుర్తించి పొదుపు సంఘాల సహకారంతో వారి వివరాలు సేకరిస్తామన్నారు. వివరాలకు 8309813473, 9398168667 నంబర్లను సంప్రదించాలన్నారు.



పోలవరం కాలువ గట్టు పరిశీలన

ద్వారకాతిరుమల: పంగిడిగూడెం వద్ద పోలవరం కుడి కాలువ గట్టును నాయకులు 90 శాతం అక్రమంగా బొక్కేసారని, మిగిలిన గట్టును కొల్లగొట్టేందుకు ప్రయత్నిస్తున్నారని సీపీఎం జిల్లా కార్యదర్శి ఆర్.లింగరాజు ఆరోపించారు. ద్వారకాతిరుమల, భీమడోలు మండలాల సీపీఎం ఆర్గనైజర్ కట్టా భాస్కరరావుతో కలిసి మంగళవారం ఆయన పంగిడిగూడెం పోలవరం కుడి కాలువ గట్టుపై జరిపిన అక్రమ తవ్వకాల ప్రాంతాన్ని పరిశీలించారు. అధికారులు స్పందించి గట్టును రక్షించాలని వారు కోరారు.

క్యాలెండర్ ఆవిష్కరణ

జంగారెడ్డిగూడెం: స్థానిక ముత్యాలమ్మ ఆలయ ప్రాంగణంలో నూతన సంవత్సర క్యాలెండర్‌ను మంగళవారం ఆవిష్కరించారు. ముఖ్య అతిథిగా మద్ది ఆంజనేయ స్వామి దేవస్థానం సహాయ కమిషనర్ ఆర్‌వీ చందన, ఆలయ చైర్మన్ డాక్టర్ రాజనా సత్యనారాయణతదితరులు పాల్గొన్నారు.

విక్టర్ ప్రసాద్ సేవలు అభినందనీయం

చింతలపూడి: సుదీర్ఘ కాలంగా ప్రజలకు నిరంతర సేవలు అందించిన ఈవోపీఆర్డీ విక్టర్ ప్రసాద్ అభినందనీయులని ఎంపీడీవో మురళీకృష్ణ అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయం వద్ద ఈవోపీఆర్డీ విక్టర్ ప్రసాద్ ఉద్యోగ పదవీ విరమణ కార్యక్రమం మంగళవారం ఘనంగా నిర్వహించారు. పంచాయతీ కార్యదర్శులు విక్టర్ ప్రసాద్ దంపతులకు పూలవూలలు వేసి ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో సెక్రటరీ కుమార్, లాల్, సాయి, మోహనరావు, ఇతర పంచాయతీ కార్యదర్శులు, సిబ్బంది, ఇతర మండలాల ఈవోపీఆర్డీలు పాల్గొన్నారు.

30 లీటర్ల నాటు సారా స్వాధీనం

కామవరపుకోట: కళ్లచెరువులో మంగళవారం నాటు సారా తయారీ కేంద్రాలపై ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు దాడులు చేశారు. ఈ దాడిలో ఓ వ్యక్తి నుంచి 30 లీటర్ల నాటు సారా స్వాధీనం చేసుకుని అతనిపై కేసు నమోదు చేసినట్లు ఎన్‌ఫోర్స్‌మెంట్ సీఐ భోగేశ్వరరావు తెలిపారు. కామవరపుకోట మండలంలో పాత కేసులో నలుగురిని బైండోవర్ చేసి తహసీల్దార్ ఎదుట హాజరుపర్చినట్లు సీఐ తెలిపారు.

